రహదారి ఇలా.. ప్రయాణం ఎలా..

- భారీ వాహనాల రాకపోకలతో ఛిద్రం
- వర్షాలకు మూసుకుపోయిన బెర్మ్‌లు
- వెదురుమూడి రోడ్డులో రోజూ ప్రమాదాలే

ఆలమూరు: దశాబ్దాలుగా కొత్తూరు-వెదురుమూడి రోడ్డు నిర్లక్ష్యపు చెరలో కొట్టుమిట్టాడుతుంది. ఒకప్పుడు పదుల సంఖ్యలో ప్రయాణించే ఈ రహదారిలో ప్రతి రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు. రహదారి అభివృద్ధి చెందకపోగా బెర్మ్‌లు విరిగిపోయి గుంతలమయంగా మారి రోజురోజుకూ కునారిల్లిపోతుంది. కొత్తపేట, మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని పలు మండలాలకు ముఖ్య కూడలిగా ఉన్న ఈ రహదారిని విస్తరించకపోవడంతో ప్రయాణికులకు, పాదచారులు అనేక అవస్థలు పడుతున్నారు. ఐదు కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ రహదారి అత్యధిక భాగం కపిలేశ్వరపురం మండలంలోనే ఉంది. ఇరు నియోజకవర్గాలకు చెందిన రహదారి కావడం వల్లే ఈ దుస్థితి దాపురించిందనే అభిప్రాయం సామాన్య ప్రజానీకం నుంచి వ్యక్తమవుతుంది. ఈ రహదారిలో ఓ పక్క పంట కాలువ, మరో పక్క పంట చేలు ఉండటంతో తరచూ కుంగిపోతోంది. మూడున్నర మీటర్లు వెడల్పు కలిగిన ఇలాంటి ఇరుకైన రోడ్డులో అనునిత్యం భారీ వాహనాలు ప్రయాణించడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. కొద్దిపాటి వర్షానికే రహదారి చిత్తడిగా మారడంతో వాహనదారులు అనేక ప్రమాదాల బారీన పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇరువైపులా ఉన్న బెర్మ్‌లు పూడికతో మూసుకుపోవడంతో మొక్కలు పెరిగిపోయి చిట్టడవిగా తయారైంది.


కొత్తూరు-వెదురుమూడి రోడ్డులో ప్రయాణిస్తున్న భారీ వాహనాలు


ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీరు నిలిచిపోవడంతో చిట్టడవిని తలపిస్తున్న రహదారి

పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నా..

రహదారి వెంబడి ఉన్న ఆలమూరు, కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల్లోని పలు గ్రామాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నా రహదారుల విషయంలో ఆ మేరకు సౌకర్యాల కల్పన జరగడం లేదు. ఈ రహదారి వెంబడి ఓఎన్‌జీసీకి చెందిన ఎనిమింది చమురు, సహజ వాయువు అన్వేషణ బావులు, పేపరుమిల్లుతో పాటు అనేక రైసుమిల్లులు కూడా ఉన్నాయి. దీంతో ప్రతి రోజు భారీ వాహనాలు ప్రవేశించడంతో గంటల కొద్ది ట్రాఫిక్ నిలిచిపోతుంది. కొద్దిపాటి వర్షం పడితే గోతులు జలమయం అవుతున్నాయి. దీనివల్ల గోతులు గుర్తించని వాహనదారులు ప్రమాదాలకు గురై క్షతగాత్రులవుతున్నారు. గత పదేళ్ల కాలంలో ఈరహదారిలో జరిగిన ప్రమాదాల్లో దాదాపు ఐదుగురు మృత్యువాత పడటం పరిస్థితికి అద్దం పడుతుంది. అలాగే నాలుగు నెలల క్రితం ఒక ప్రైవేట్ మిల్క్ డైరీకి చెందిన వాహనం పంట కాలువలో పడిపోయి రెండు రోజుల తరువాత కాని బయటకు రాలేని పరిస్థితి నెలకొంది.

నిద్రావస్థలో ఆర్అండ్‌బీ శాఖ

కొత్తూరు-వెదురుమూడి రహదారి దారుణంగా ఉన్న ఆర్అండ్‌బీ శాఖాధికారులు పట్టించుకోవడలం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఈ రహదారి దుస్థితిపై అనేకమార్లు ఆర్అండ్‌బీ శాఖ దృష్టికి తీసుకువెళ్లి కనీసం మరమ్మతులు చేపట్టాలని సూచించినా ప్రయోజనం లేకపోయిందని పలువురు ప్రజా ప్రతినిధులు ఆవేదన చెందుతున్నారు.

మద్యం దుకాణం వ్యతిరేక పోరాట స్ఫూర్తితో..

మండలంలోని పెదపళ్ల, చింతలూరు, పెదపళ్ల, పినపళ్ల, సూర్యారావుపేటకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు స్థానికుల సహకారంతో కొత్తూరు సెంటర్‌లో ఇటీవల మద్యం దుకాణం ఏర్పాటును అడ్డుకున్నారు. రహదారి పక్కన మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల కలిగే అనర్థాలు ప్రజలకు వివరించి విమర్శకుల నుంచి సైతం ప్రశంసలు పొందారు. అదే స్ఫూర్తితో ఓఎన్‌జీసీ, పారిశ్రామికవేత్తల భాగస్వామ్యంతో పాటు ప్రభుత్వం సహకారంతో త్వరితగతిన ఈ రహదారిని విస్తరించాలనే సగటు ప్రయాణికుడి అభిప్రాయంగా ఉంది.

వర్షాలు తగ్గాక మరమ్మతులు

"వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే కొత్తూరు-వెదురుమూడి రోడ్డు మరమ్మతులు చేపట్టనున్నాం. ఆ రహదారి విస్తరణకు ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించి ఉన్నాం. తాత్కాలిక మరమ్మతుల కోసం టెండర్ల ప్రక్రియను పూర్తి చేస్తున్నాం."

– సూర్యనారాయణ, ఇన్‌చార్జి, ఆర్అండ్‌బీ జేఈ, రామచంద్రపురం

క్లుప్తంగా

సమర్థవంతంగా ఉచిత ఇసుక విధానం


ఊబలంకలో ఇసుక ర్యాంపు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

రావులపాలెం: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక నిర్వహణ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అధికారులు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. శనివారం మండలంలోని ఊబలంక ఇసుక రీచ్‌ను ఆయన అధికారులతో కలసి పరిశీలించారు. నీరు తగ్గిన అనంతరం ఇసుక తవ్వకాలకు చర్యలు చేపడుతూ పారదర్శకంగా ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలని ఆదేశాలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఇసుక లభ్యత, వాహనాలు సరఫరా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ఇసుక బుకింగ్ వాహనాల బుకింగ్ ప్రక్రియలపై ఇసుక రీచ్ నిర్వహణ సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. అన్ని అంశాలపై పూర్తిగా అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రక్రియను ఎటువంటి అపోహలకు తావు లేకుండా నిర్వహించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనన్నారు. ఇసుక రీచ్ సరిహద్దులను మ్యాప్‌లు ఆధారంగా గుర్తించి ఇసుక ర్యాంపు నిర్వహణపై తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.శ్రీకర్, జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి అశోక్ కుమార్, రియాల్టీ ఇన్‌స్పెక్టర్ సుజాత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపుల పరిశీలన

ఆత్రేయపురం: మండలంలోని వివిధ గ్రామాల్లోని ఇసుక ర్యాంపులను శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ పి.నిశాంతి పరిశీలించారు. ఆత్రేయపురం వద్దిపర్రు, పులిదిండి గ్రామాలకు వెళ్లి అక్కడ ఇసుక ర్యాంపు ఏర్పాట్లు, నిర్వహణపై తహసీల్దార్ రాజేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇసుక ర్యాంపులను ట్రాక్టర్లలో సొంత అవసరాలకు ఉచితంగా అందించాలని ఆమె ఆదేశించారు. అనంతరం ఇసుక ర్యాంపుల నిర్వహణపై రెవెన్యూ, ఇరిగేషన్, ఏటిగట్ల శాఖ అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు.

ఆర్ఎస్‌కే సిబ్బందికి అవగాహన సదస్సు

పి.గన్నవరం: వరిపంటను ఆశించే తెగుళ్లపై అవగాహన కల్పించుకుని, వాటి నివారణ చర్యలపై రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు ఆర్ఎస్‌కే (రైతు సేవా కేంద్రం) సిబ్బందికి సూచించారు. స్థానిక ఏడీఏ కార్యాలయం వద్ద మామిడికుదురు, పి.గన్నవరం, అంబాజీపేట మండలాలకు చెందిన ఆర్ఎస్‌కే సిబ్బందికి శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎ.రాజశేఖర్, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త నందకిషోర్‌లు మాట్లాడుతూ వరిపంటలో సస్యరక్షణపై ఆర్ఎస్‌కే సిబ్బందికి అవగాహన కల్పించారు. స్థానిక ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ పంట నమోదు చేసేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

సంప్రదాయబద్ధంగా అట్లతద్దె

కొత్తపేట/మామిడికుదురు/అయినవిల్లి/ఆలమూరు: అట్లతదియ పర్వదినాన్ని మహిళలు సంప్రదాయబద్ధంగా జరుపుకొన్నారు. నియోజకవర్గాల్లో గ్రామ గ్రామాన వివాహం కాబోయే యువతులు, కొత్తగా వివాహమైన మహిళలు ఇంట అట్లతదియ సందడి నెలకొంది. శనివారం తెల్లవారుజామున లేచి వారు ఇతర పేరంటాళ్లతో కలసి భోజనం ఆరగించారు. అప్పటి నుంచి రోజంతా ఉపవాసం చేశారు. మధ్యాహ్నం సహచర యువతులు, చిన్నారులు, మహిళలతో చెట్లకు ఏర్పాటు చేసిన ఉయ్యాల ఊగుతూ సందడి చేశారు. సాయంత్రం స్నానాలు చేసి నూతన వస్త్రాలు, కొందరు పెళ్లి నాటి పసుపు చీరను ధరించి పసుపు, కుంకుమలు, పండ్లు, పుష్పాలతో సమీప కాలువ రేవులకు, గోదావరి వద్దకు వెళ్లి పసుపుతో గౌరీదేవికి, గంగాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గౌరీదేవిని నీటిలో కలిపారు. అనంతరం ఇంటికి తిరిగి వచ్చి ముత్తైదువలకు అట్లు, పండ్లు, పువ్వులు, గాజులు, రవికలతో కూడిన పళ్లెంతో వాయనాలు సమర్పించారు. పలు గ్రామాల్లో అట్ల తదియ సందర్భంగా సందడి నెలకొంది. తెలుగు లోగిళ్ల సంప్రదాయరీతిలో కళకళలాడాయి. గోమాతకు విశేష పూజలు నిర్వహించారు. సమీప ఆలయాల్లో పండితులకు దక్షిణతాంబూలాలు సమర్పించారు. రాత్రి ఆకాశంలో నక్షత్ర దర్శన అనంతరం ఉపవాసాన్ని ముగించి ప్రసాదం, అట్లు భుజించారు.


అయినవిల్లి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

వైద్యం కోసం యువతి వేడుకోలు

మామిడికుదురు: రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి ఆ కుటుంబానిది. కూలి పనులు చేసుకుని ఎంతో ఆనందంగా జీవిస్తున్న ఆ కుటుంబానికి అనుకోని ఆపద వచ్చి పడింది. కోవిడ్ వ్యాక్సిన్ వికటించి రెండు కాళ్లూ చచ్చుబడి పోవడంతో మూడేళ్ల నుంచి ఆ యువతి మంచానికే పరిమితమైంది. ఆమె వైద్యానికి రూ.లక్షలు ఖర్చువుతుందని డాక్టర్లు చెబుతున్నారు. అంత ఆర్థిక స్తోమత వారికి లేకపోవడంతో ప్రభుత్వ సహాయం కోసం ఆమె కుటుంబం ఆశగా ఎదురు చూస్తోంది. అప్పనపల్లి మండపాటివారి పాలానికి చెందిన ఉండ్రు ధనలక్ష్మి (27) రెండు కాళ్లూ చచ్చుబడి పోయాయి. ఎవరి సహాయం లేకుండా ఆమె కనీసం మంచం మీద నుంచి కూడా లేవలేని పరిస్థితి. ఆమెకు ఇద్దరు కొడుకులు. భర్త సత్యనారాయణది రాజోలు మండలం పొన్నమండ గ్రామం. అతను కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. 2021 డిసెంబర్‌లో మూడో నెల బాలింతగా ఉన్న సమయంలో ఆమె ఇంటికి వచ్చి కోవిడ్ వ్యాక్సిన్ వేశారని ఆమె తండ్రి బాబూరావు, తల్లి వెంకటలక్ష్మి తెలిపారు. అప్పటి నుంచి ఆమె రెండు కాళ్లూ చచ్చుబడి పోయాయని తెలిపారు. శరీర భాగాలకు రక్త ప్రసరణ సక్రమంగా జరగకపోవడంతో ఆ యువతి పరిస్థితి దారుణంగా మారింది. ఒక్కోసారి రెండు కాళ్లూ, రెండు చేతులూ వణికిపోవడం, శరీరంలో భాగాలు షేక్ అవ్వడం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయని కుటుంబ సభ్యులు వాపోయారు. ఆమెకు హైదరాబాద్ నిమ్స్‌లో వైద్యం చేయిస్తే ఫలితం ఉంటుందని డాక్టర్లు చెబుతున్నారన్నారు. దానికి లక్షల్లో ఖర్చవుతుందని ఆమె కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వైకల్యం పింఛన్‌తో పాటు దీర్ఘకాలిక పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదని వాపోయారు. వైకల్యం శాతం తక్కువ ఉందని తిరస్కరించారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆమె దీన పరిస్థితిపై స్పందించి, ఆమెకు ఉచిత వైద్యం అందించే దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఆ దిశగా తక్షణం ప్రజా ప్రతినిధులు స్పందించి ఆ యువతి కుటుంబానికి అండగా నిలవాలని కోరుతున్నారు.


మంచానికే పరిమితమైన ధనలక్ష్మి

పొడగట్లపల్లిలో అన్నక్షేత్రం ప్రారంభం

రావులపాలెం: మండలంలోని పొడగట్లపల్లి గ్రామంలో హరే కృష్ణ మూమెంట్ వారి ఆధ్వర్యంలో నిర్మించిన అన్న క్షేత్ర శాలను శనివారం ప్రారంభించారు. రూ.1.20 కోట్లతో నిర్మించిన వంట శాలను నిర్మాణ దాత అల్లూరి ఇంద్రకుమార్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్న క్షేత్రాన్ని పరిశీలించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్న క్యాంటీన్లకు ఇక్కడ నుంచే ఆహారం సరఫరా చేస్తారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం అన్న క్షేత్రాన్ని సత్యానందరావు పరిశీలించి యాజమాన్యాన్ని, నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీకర్, తహసీల్దార్ ముక్తేశ్వరరావు, మాధవ దాస, వైకుంటేశ్వరదాస తదితరులు పాల్గొన్నారు.


అన్నక్షేత్రాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకే కేసు


పాటి శివకుమార్

సఖినేటిపల్లి: ఇటీవల విజయవాడలో వరద సహాయక చర్యల్లో జరిగిన అవినీతిని ఎండగట్టినందుకు గాను 'సాక్షి' దినపత్రిక ఎడిటర్‌పై కేసు నమోదు చేయడాన్ని మాజీ సెట్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ తీవ్రంగా ఖండించారు. శనివారం సఖినేటిపల్లిలో ఆయన మీడియాకు ఓ ప్రకటనలో తెలిపారు. ఎడిటర్‌పై కేసు నమోదు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. వరదలు వచ్చినపుడు వరద బాధితులు కోటి మందికి రూ.368 కోట్లతో భోజనాలు పెట్టారని, కొవ్వొత్తులకు, అగ్గిపెట్టెలు, జనరేటర్లకు రూ.23 కోట్లు ఖర్చు చేశారని సాక్షాత్తూ ప్రభుత్వం లెక్కలు చెప్పిందన్నారు. ప్రభుత్వం చెప్పిన లెక్కలు వాస్తవాలను ఎపుడూ ప్రజలకు చేరవేయడంలో ముందుండే 'సాక్షి' దినపత్రిక ప్రచురించిందన్నారు. వాస్తవాలను ప్రజలకు చేరవేయడం ఇష్టం లేని ఈ కూటమి ప్రభుత్వం అన్యాయంగా 'సాక్షి' ఎడిటర్‌పై కేసు పెట్టడం ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే ప్రయత్నంగా ఉందని శివకుమార్ పేర్కొన్నారు.

శాస్త్రీయ నృత్యంలో లేఖనకు స్వర్ణ నంది

కొత్తపేట: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన సంగీత-నృత్య మహోత్సవంలో కొత్తపేటకు చెందిన చిన్నారి గండ్రోతు లేఖన స్వర్ణ నంది కైవసం చేసుకుంది. హైదరాబాద సిరి ఆర్ట్స్ అకాడమీ, నృత్యమాల నాట్యకళ వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన సంగీత-నృత్య మహోత్సవంలో తమ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న చిన్నారి గండ్రోతు లేఖన పాల్గొని స్వర్ణ నంది కైవసం చేసుకున్నట్టు స్థానిక భాష్యం స్కూలు ప్రిన్సిపాల్ లోకేశ్వరరావు శనివారం తెలిపారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో లేఖనను, తల్లిదండ్రులు రమ్యజ్యోతి, మనోహర్‌లను భాష్యం జోనల్ ప్రిన్సిపాల్ జె.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ లోకేశ్వరరావు, చాంప్స్ ప్రిన్సిపాల్ ఎస్.రమాజ్యోతి, ఉపాధ్యాయులు అభినందించారు.


స్వర్ణ నందితో చిన్నారి లేఖన

త్రుటిలో తప్పిన ప్రమాదం

మామిడికుదురు: పాశర్లపూడిబాడవ జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపాన జాతీయ రహదారిపై శనివారం ఊక లోడుతో వెళ్తున్న లారీని ఐషర్ వ్యాను ఢీకొట్టింది. లారీని ఢీ కొట్టిన వ్యాను బోల్తా పడింది. అమలాపురం వైపు వెళ్తున్న ఊక లారీని మామిడికుదురు వైపు వస్తున్న వ్యాను ఢీ కొట్టిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంతో లారీలోని ఊక రోడ్డుపై పడి పోయింది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

ఈ ప్రమాదంలో వ్యాన్‌లోని డ్రైవర్‌తో పాటు క్లీనర్, లారీ డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. జేసీబీ సహాయంతో వ్యాన్‌తో పాటు లారీని పక్కకు తప్పించి ట్రాఫిక్ క్లియర్ చేసే సమయంలో అటు పాశర్లపూడి బ్రిడ్జి వైపు, ఇటు మామిడికుదురు వైపు భారీగా ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ప్రజా సమస్యలను తెలుసుకోవాలి

అంబాజీపేట: గ్రామాల్లోనే నాయకులు ఉండి ప్రజా సమస్యలు తెలుసుకోవాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మండలంలో ఆరు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న రోడ్లకు శనివారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.లక్షలతో అందరికీ అవసరమయ్యే రహదారులను నిర్మిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. పలు రోడ్లకు ఉపాధి హామీ పథకంలో భాగంగా రోడ్లు నిర్మించనున్నామని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్‌లు వాసంశెట్టి రేవతి, మట్టపర్తి నాగరాజు, గణపతి వీర రాఘవులు, బొంతు పెదబాబు, చిన్నం బాలవి జయరావు, వాసంశెట్టి వరలక్ష్మి పాల్గొన్నారు.


వక్కలంకలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

రెవెన్యూ గ్రామ సభల్లో వినతుల వెల్లువ

ఆలమూరు: మండలంలోని కలవచర్లలో శనివారం రెవెన్యూ గ్రామ సభలు ప్రారంభమయ్యాయి. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ వడ్డి వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు విచ్చేసి గ్రామ రెవెన్యూ సభలు ప్రారంభించారు. గ్రామానికి చెందిన అనేక మంది రైతులు దరఖాస్తు రూపంలో తమ సమస్యలను అధికారులకు అందజేశారు. గ్రామ సభల్లో అందిన 18 దరఖాస్తులను 15 రోజుల లోపు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ ప్రకాష్‌బాబు హామీ ఇచ్చారు. గ్రామ సభలో ఇచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు రెవెన్యూశాఖ సిద్ధంగా ఉందన్నారు. మండల రెవెన్యూ అధికారి ఎం.రామాయమ్మ, మండల సర్వేయర్ ఎం.ప్రభావతి, గ్రామ కార్యదర్శి ఒబిలిశెట్టి వేణి తదితరులు పాల్గొన్నారు.


కలవచర్లలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ప్రకాష్‌బాబు

స్తంభించిన జన జీవనం

మామిడికుదురు: ఓ వైపు ఎండ, మరో వైపు వర్షంతో శనివారం విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ఉదయం పరిస్థితి ఈ విధంగా మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన భారీ వర్షంతో జన జీవనం పూర్తిగా స్తంభించింది. పలు రహదారులు నీట మునిగాయి. కాలనీలను వర్షపునీరు ముంచెత్తింది. నగరం, మామిడికుదురు, పాశర్లపూడి గ్రామాల్లోని 216వ నంబర్ జాతీయ రహదారిపై వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. మొగలికుదురు వీవర్స్ కాలనీ, మామిడికుదురు ఆల్‌క్యాస్ట్ కాలనీ వాసులు ఇక్కట్లు పడ్డారు. మామిడికుదురు నుంచి నగరం వరకు 216వ నంబర్ జాతీయ రహదారితో అనుసంధానమై ఉన్న మూడు లింకు రోడ్లు ముంపుబారిన పడ్డాయి. ఈ రోడ్లపై రెండడుగుల మేర వర్షం నీరు నిలిచిపోయింది. వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాశర్లపూడి కైకాలపేట నుంచి పాశర్లపూడిబాడవ వైపు పెట్రోల్ బంక్ వరకు 216వ నంబర్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ఆ తోతుల్లో భారీగా వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు.

అంబాజీపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శనివారం సుమారు మూడు గంటల పాటు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో అంబాజీపేట మండలం తడిసి ముద్దయింది. భారీ వర్షానికి అంబాజీపేట, మాచవరం, పుల్లేటికుర్రు, ముక్కామల తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు నీట మునిగాయి. జన జీవనం స్తంభించింది. భవన నిర్మాణ కార్మికులు, కూలీలు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొబ్బరి తోటల్లో వర్షపు నీరు చేరింది. బస్టాండ్ ప్రాంగణమంతా వర్షపు నీటితో నిండింది.


మామిడికుదురులో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

అంబాజీపేట: రీసర్వే పూర్తయిన భూములకు సంబంధించి ఎటువంటి సమస్యలున్నా గ్రామ సభల ద్వారా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ జె.వెంటేశ్వరి అన్నారు. ముక్కామలలో సచివాలయం వద్ద రెవెన్యూ గ్రామ సభ శనివారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వేలో ఆర్ఎస్ నెంబర్‌కి బదులుగా ఎల్‌పీ నెంబర్‌ను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ మార్పును రైతులు గమనించాలని సూచించారు. రైతుల సమస్యలు, అభ్యంతరాలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సభలు దోహదపడతాయన్నారు. గ్రామ సభలో వచ్చిన వినతులను తహసీల్దార్ స్వీకరించారు. మండల సర్వేయర్ గీతా రమేష్, వీఆర్వోలు కోమలి, కనకమహాలక్ష్మి, సర్వేయర్ జి.సాయ్, స్థానికులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసి పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం తులాభారంగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఆదిలక్ష్మి కుటుంబానికి సాయం


సహాయం అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు, యూత్ ప్రతినిధులు

మామిడికుదురు: అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబానికి ఆదర్శ ఆంధ్రా యూత్-కువైట్ కార్యవర్గం అండగా నిలిచింది. ఆదుర్రు గ్రామానికి చెందిన వృద్ధురాలు నేరేడుమిల్లి ఆదిలక్ష్మి భర్త గతేడాది మృతి చెందారు. ఆమె పెద్ద కుమారుడు శ్రీను, చిన్న కుమారుడు అశోక్ గొంతు క్యాన్సర్ తో ఇబ్బంది పడుతున్నారు. వారి పరిస్థితి తెలుసుకున్న స్థానికులు ఎన్ఆర్ఐ ఉండ్రు వెంకటరెడ్డి విషయాన్ని ఆదర్శ ఆంధ్రా యూత్‌కు తెలిపారు. దీనిపై స్పందించిన యూత్ ప్రతినిధులు శనివారం ఆదిలక్ష్మి కుటుంబానికి రూ.15 వేల సాయం అందించారు. సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు ఈ సహాయాన్ని అందజేశారు. యూత్ వ్యవస్థాపకుడు మోకా స్వామి, అధ్యక్షుడు శ్యాంబాబు, కార్యదర్శి గెద్దం రామారావు, ఇంజేటి కృష్ణకుమార్, తాడి సహదేవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. స్థానికులు కార్యక్రమంలో పాల్గొన్నారు.